తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# ఈసుళ్ళ కోసం వెళ్ళి మృత్యువు పాలు

ఏర్పేడు (శ్రీకాళహస్తిరూరల్),ఆగస్టు 31 ప్రభాతవార్త : పంట పొలాల్లో అడవి పందుల రక్షణ కోసం రైతులు విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకోవటం జరుగుతుంది. తెలియకుండా వెళ్ళినవారు కరెంటు షాకుకు గురై మృతి చెందటం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరిపాటి అయ్యింది. ఈ నేపథ్యంలో ఏర్పేడు మండలం ముసలిపేడు గ్రామంలో ఓ సంఘటన చోటు చేసుకుంది. ఈసుళ్ళ కోసం వెళ్ళి విద్యుత్ షాక్‌కు గురై బత్తెయ్య( 43) అనే వ్యక్తి మృతి చెందాడు. అయితే పంట పొలాల రక్షణకు కంచె ఏర్పాటు చేసిన రైతులు ఉదయం చూసి మృతదేహాన్ని పక్కను ఉన్న ముళ్ళ పొదల్లో పడేసినట్లు మృతుని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. వాస్తవాలు పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి. ముసలిపేడుకు చెందిన బత్తెయ్య ఈసుళ్ళ వేటకు వెళ్ళేవాడని తెలిసింది. అలాగే రెండు రోజుల క్రితం రాత్రి బయలుదేరాడు. కానీ తరువాత ఇంటికి రాలేదు. బంధువులు, కుటుంబ సభ్యులు చెట్టూ పుట్టా



ముళ్ళ పొదల్లో బత్తెయ్యమృతదేహం

వెతికారు. కానీ ఆచూకి తెలియ లేదు. అయితే ఇక్కడ ఓ రైతు తమ పంటపొలాల్లో అడవి పందులు పడి ధ్వంసం చేయకుండా రాత్రివేళల్లో విద్యుత్ కంచెను ఏర్పాటు చేసేవారని తెలిసింది. రాత్రి ఈసుళ్ళ కోసం వెళ్ళిన బహుశా ప్రమాదవశాత్తు విద్యుత్ కంచె తెలియక మృత్యువు పాలైనట్లు కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. గురువారం ఉదయం బత్తెయ్య శవంగా ముళ్ళ కంప పొదల్లో కనబడటంతో కుటుంబం తల్లడిల్లి పోయారు. పోలీసులకు ఫిర్యాదు అందటంతో సిఐ శ్రీహరి సారథ్యంలో పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాస్తవాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

# పింఛన్లలో అదే వంచన!

**- పాతవాటినే పునరుద్ధరణ..135 మందికి ఊరట**

కోట, ఆగస్టు 31 ప్రభాతవార్త : వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులకు సామాజిక భద్రత కింద రాష్ట్రప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ నగదు అందిస్తోంది. ఆ సొమ్ము ఆసరాతోనే మందులు దగ్గర నుంచి ఇతరత్రా రోజువారీ ఖర్చులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే అనర్హుల ఏరివేతలో భాగంగా ఆరునెలలకు ఒకసారి ఆరంచెల విధానానికి లబ్ధిదారుల జాబితాను అనుసంధానం చేస్తున్నారు. ఏదోఒక సమస్యను చూపుతూ కొందరికి పింఛన్ ఆపేస్తున్నారు. అందుకుగల కారణాలకు సంబంధించి నోటీసులు జారీ చేస్తున్నారు. నిర్ణీత గడువులోగా సమస్య పరిష్కరించుకుంటు పింఛన్‌ను పునరుద్ధరిస్తున్నారు. లేదంటే ఆ తర్వాత నెల నుంచి శాశ్వతంగా ఆగిపోతుంది. కోట మండలంలో 200 మంది దరఖాస్తులు చేసుకోగా, 135 మందికే సెప్టెంబర్ 1వ తేదీ నుంచి పింఛన్ నగదు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. గత నెలలో కూడా కొత్త వాటికి మంజూరు కాలేదు. ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం 60 సంవత్సరాలు నిండిన వారు వృద్ధాప్య పింఛన్‌కు అర్హులు. మత్స్య కారులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులకు 50 సంవత్సలు నిండితే పింఛన్‌కు అర్హులు. చర్మకారులకు కనీసం 40 సంవత్సరాలు ఉంటే అర్హులు. ప్రస్తుతం వృద్ధాప్య, వితంతు, ఒంటని మహిళలకు రూ.2750, డప్పు కళాకారులకు రూ.3 వేలు అందజేస్తున్నారు. ఇదంతా ప్రభుత్వం అందిస్తున్న కొత్త నిబంధనలతో మరికొందరికి కత్తెర వేస్తున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. చిన్నపాటి సాంకేతిక సమస్యలతో పింఛన్ నిలిచినా మళ్లీ నగదు కోసం ఆరునెలల పాటు నిరీక్షించాల్సి వస్తుంది. ఆర్థిక వనరుల లోటు దృష్ట్యా ప్రభుత్వం పింఛన్ మంజూరులో నెలల తరబడి జాప్యం చేస్తోందన్న విమర్శలు వస్తున్నాయి.

**అందని వేతనం.. గడవని జీవనం**

ఒకటో తారీఖు వస్తుందంటే చాలు వేతనాలు వస్తాయని ఉద్యోగులు ఆశతో ఎదురు చూస్తుంటారు. వారం..పదిరోజుల ఆలస్యమైతే కొంచెం ఆందోళన చెందుతారు.ఆలాంటిది నెలల తరబడి ఇవ్వకపోతే.. వారి జీవనం కష్టతరమే ..అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు. వ్యవసాయశాఖకు అనుబంధంగా పని చేసే ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది.వీరికి ఆరు నెలలగా జీతాలు ఇవ్వడం లేదు. దీంతో అధికారులను అడగలేక. ఆందోళన చేపట్టలేక అప్పులు చేసి కుటుంబ పోషణను నెట్టుకొస్తున్నారు. రైతులను పొలాల్లో అన్ని విధాలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఆ బాధ్యతలన్నీ సిబ్బందే చూసుకోవాలి. వివిధ గ్రామాల్లో పర్యటించాల్సి ఉంటుంది.

# ఆపరేషన్ 'గజ' సక్సెస్

**- ఎట్టకేలకు ఒంటరి ఏనుగు బందీ - కుంకీల సహాయంతో మత్తు ఇంజెక్షన్ ఇచ్చి ఏనుగు పట్టివేత - మరో మహిళపై దాడి చేసి హతమార్చిన ఒంటరి ఏనుగు**



ఒంటరి ఏనుగును కుంకీల సహాయంతో మత్తు మందు ఇచ్చి బంధించిన అటవీశాఖ అధికారులు

గుడిపాల, ఆగస్టు 31 ప్రభాతవార్త: గుడిపాల మండల పరిసర ప్రాంతాల్లోని ప్రజలను రెండు రోజుల పాటు గజగజలాడించిన ఒంటరి ఏనుగు ఎట్టకేలకు అటవీశాఖ అధికారులకు చిక్కింది. అడవి నుండి జనావాసాల్లోకి వచ్చి తిష్ట వేసిన ఒంటరి ఏనుగును పట్టుకోవడంలో అటవీ, రెవెన్యూ, పోలీసు అధికారులు ఎట్టకేలకు విజయం సాధించారు. 190 రామాపురం గ్రామ పరిసరాల్లోని చెరకు తోటలో తిష్ట వేసిన ఒంటరి ఏనుగును శిక్షణ పొందిన ఏనుగులు(కుంకీల) సహాయంతో ఫారెస్ట్ క్యూరేటర్ మత్తు ఇంజెక్షన్ ఇవ్వడంతో ఏనుగుకు మత్తు ఆవరించింది. మత్తులో వున్న ఒంటరి ఏనుగును ఫారెస్ట్ అధికారులు శిక్షణ పొందిన ఏనుగుతో బంధించి తిరుపతి జూ పార్క్‌కు తరలించారు. తమిళనాడు సరిహద్దు అటవీ ప్రాంతం నుండి గుడిపాల మండలంలోకి బుధవారం తెల్లవారుజాము వచ్చిన ఒంటరి ఏనుగు బుధవారం భార్యభర్తలు వెంకటేష్, సెల్విలపై దాడి చేసి చంపివేసింది. అలాగే బసవపల్లి గ్రామంకు చెందిన కార్తీక్‌పై దాడి చేయడంతో అతనికి తీవ్ర గాయాలై వేలూరు సిఎంసి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో 190 రామాపురం గ్రామ పరిసరాల్లో బుధవారం రాత్రి తిష్ట వేసిన ఒంటరి ఏనుగులు పట్టుకోవడానికి రామకుప్పం నుండి శిక్షణ పొందిన ఏనుగులు(కుంకీల)ను తీసుకువచ్చి ఆపరేషన్ 'గజ' నిర్వహించి పూర్తి చేయాలని నిర్ణయించారు. అయితే అప్పటికే రాత్రి కావడం ఒంటరి ఏనుగు ఎక్కడ వుందనే సమాచారం లేకపోవడంతో రాత్రి శిక్షణ ఏనుగులను రంగంలోకి దింపలేదు. బుధవారం తెల్లవారు 190 రామాపురం పరిసరాల్లో ఒంటరి ఏనుగు జాడ కన్పించకపోవడంతో మళ్ళీ అటవీశాఖ అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఒంటరి ఏనుగు అందరి కళ్ళుగప్పి చీలాపల్లి మీదుగా తాళంబేడుకు చేరుకొంది. అక్కడ కొంతసేపు తిరుగులాడిన ఒంటరి ఏనుగు అక్కడి నుండి తమిళనాడు సరిహద్దు గ్రామమైన బోడినత్తం పరిసరాల్లోకి చేరుకొని అక్కడ వున్న మహిళ వసంత(55)పై దాడి చేసి హతమార్చింది. అలాగే ఈ ఒంటరి ఏనుగు బుధవారం మూడు ఆవులు, రెండు కుక్కలు, రెండు మేకలను హతమార్చగా, గురువారం రెండు పశువులు, ఒక మేకను పొట్టన పెట్టుకొంది. బోడినత్తం గ్రామం నుండి తిరుగు ప్రయాణమైన ఒంటరి ఏనుగు మళ్ళీ 190 రామాపురం పరిసరాల్లోని చెరకు తోటల్లోకి వచ్చి తిష్ట వేసింది. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులు ఆపరేషన్ గజ నిర్వహించడానికి సిద్ధమయ్యారు. అయితే ఒంటరి ఏనుగు ఆచూకీ కన్పించకపోడంతో ఆ ఏనుగు కోసం కుంకీలతో వెయ్యి కళ్ళతో ఎదురు చూడటం ప్రారంభించారు. ఒంటరి ఏనుగు సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో కన్పించడంతో అటవీశాఖ క్యూరేటర్ తుపాకీ పేల్చి మత్తు ఇంజెక్షన్‌ను ఒంటరి ఏనుగుకు ఇచ్చాడు. క్యూరేటర్ తుపాకీతో కాల్చిన మత్తు మందు నేరుగా ఒంటరి ఏనుగు తొడపై గుచ్చుకొని లోపలికి వెళ్ళింది. కొద్ది సేపటికి క్యూరేటర్ ఇచ్చిన మత్తు మందు ప్రభావంతో ఒంటరి ఏనుగు మత్తుగా పడిపోయింది. ఈ క్రమంలో శిక్షణ ఏనుగులు వినాయక, జయంత్‌లు రంగంలోకి దిగి ఒంటరి ఏనుగును బంధించడానికి అటవీశాఖ అధికారులకు సహకరించాయి. అటవీశాఖ అధికారులు ఒంటరి ఏనుగును తిరుపతి జూకు తీసుకెళ్ళడానికి సిద్ధమయ్యారు. ఈ ఆపరేషన్ గజ కార్యక్రమంలో సిసిఓఎఫ్ నాగేశ్వరరావు, డిఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి, ఫారెస్ట్ రేంజర్లు బాలకృష్ణారెడ్డి, థామస్ సుకుమార్‌లు, అనిమల్ స్పెషలిస్టులు, తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్, ఎంపిడిఓ రాజశేఖర్, ఇతర మండల స్థాయి అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భారత అంతరిక్ష పరిశోధనలో...

# గురితప్పని రాకెట్ పిఎస్ఎల్వి

**- చంద్రయాన్-1, మంగళయాన్‌తో పాటు ఆదిత్య ఎల్1 ప్రయోగాలు ఈ రాకెట్లతోనే**
**- మూడవ గ్రహం పరిశోధనకు రేపు దూసుకెళ్లనున్న రాకెట్**



నాలుగు దశల నిర్మాణం పూర్తి చేసుకున్న పిఎస్ఎల్వి సి-57 రాకెట్

శ్రీహరికోట (తడ), ఆగస్టు 31 ప్రభాతవార్త : గ్రహాల పరిశోధనతో పాటు ఒకేసారి వంద ఉపగ్రహాలకు పైగా అందరిక్షంలో ప్రవేశపెట్టిన పిఎస్ఎల్వి రాకెట్లు ఇస్రో శాస్త్రవేత్తలకు ఎప్పుడూ పేరుప్రతిష్టలు తీసుకొస్తున్నాయి. ప్రస్తుతం ఆదిత్య ఎల్1 ప్రయోగం కూడా పిఎస్ఎల్వి రాకెట్ ద్వారానే చేపడుతున్నారు. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రానికి ఇంత ప్రతిష్ట దక్కిందంటే అది పిఎస్ఎల్వి సిరీస్‌లతోనే పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో ఇప్పటికి 58 రాకెట్లను ప్రయోగించి ఉన్నారు. అందులో రెండు తప్ప 56 ప్రయోగాలు విజయవంతం అయ్యాయి. మొదట్లో పిఎస్ఎల్వి డెవలప్‌మెంటల్ రాకెట్‌ను మూడు దఫాలు ప్రయోగించారు. అందులో మొదటిది మాత్రం విఫలమైంది. ఆ తర్వాత పిఎస్ఎల్వి-సి సిరీస్‌ను ప్రారంభించారు. ఈ సిరీస్‌లో 55 ప్రయోగాలు చేపట్టారు. పిఎస్ఎల్వి సి-13 పేరు తప్ప పిఎస్ఎల్వి సి1 నుంచి 57 దాకా ఈ సిరీస్ కొనసాగింది. ఇందులో ఒక్క నావిగేషన్ ఉపగ్రహ ప్రయోగం తప్ప అన్నీ ఘన విజయాలే. ప్రస్తుతం పిఎస్ఎల్వి సి-57 పేరుతో ఆదిత్య ఎల్1ను శనివారం మధ్యాహ్నం ప్రయోగిస్తున్నారు. గతంలో చంద్రయాన్-1, మంగళయాన్-1 ప్రయోగాలు సైతం పిఎస్ఎల్వి రాకెట్లే విజయవంతం చేశాయి. ఇప్పుడు సూర్య పరిశోధనల కోసం ఆదిత్య ఎల్1 ప్రయోగిస్తున్నారు. ప్రాథమికంగా నాలుగు దశలతో ఈ రాకెట్‌ను నిర్మిస్తుంటారు. రెండు ఘన ఇంధనం, మరో రెండు ద్రవ ఇంధన దశలు ఉంటాయి. అయితే రాకెట్ క్రింది భాగాన మాత్రం ఉపగ్రహాల బరువును బట్టి స్ట్రాపాన్ల సంఖ్య పెంచుకుంటూ పోతారు. ఉపగ్రహాల బరువు తక్కువగా ఉంటే అసలు స్ట్రాపాన్లే లేకుండా కోర్‌అలాన్ తరహాలో రాకెట్‌ను రూపొందిస్తారు. ఉపగ్రహం బరువు ఎక్కువగా ఉంటే స్ట్రాపాన్ల సంఖ్య ఆరుకు పెంచుతారు. ప్రస్తుతం 1500 కిలోల బరువు ఉన్న ఆదిత్య ఎల్1 ఉపగ్రహం కోసం స్ట్రాపాన్ల సంఖ్య పెంచడం కాకుండా వాటి పొడవును కూడా పెంచారు. దీనితో రాకెట్ పొడవు పెరిగింది. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో రెండు వేల కిలోల లోపు ఉపగ్రహాలను మాత్రమే ప్రయోగించే సౌలభ్యం ఉంది. ఈ కారణం చేతనే ఇస్రో జిఎస్ఎల్వి, ఎల్విఎం3 వంటి భారీ రాకెట్లను రూపొందించింది. ప్రస్తుతం పిఎస్ఎల్వి సిరీస్ ముందుకు కొనసాగుతుండగా, ఈ తరహా రాకెట్ల ద్వారానే ఎక్కువ విదేశీ అంతరిక్ష పరిశోధన సంస్థలు తమ ఉపగ్రహాలను శ్రీహరికోట నుంచి ప్రయోగించడానికి ముందుకు వస్తున్నాయి. ఆదిత్య ఎల్1 ప్రయోగం విజయవంతమైతే ఇప్పటికే చంద్రయాన్-3 ఘన విజయంతో దూసుకెళ్లిన ఇస్రో ముందు మరికొన్ని విదేశీ అంతరిక్ష పరిశోధన సంస్థలు క్యూ కట్టే అవకాశం ఉంది.

## వైద్య విద్యార్థులు సేవాభావంతో...

# ఉన్నతస్థాయికి ఎదగాలి

**- పిఇఎస్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ కృష్ణమూర్తి - ఘనంగా పిఇఎస్ వార్షికోత్సవం ఉత్సవ్ 23 వేడుకలు**




ప్రసంగిస్తున్న పిఇఎస్ మెడికల్ డైరెక్టర్ డా॥ సురేష్

కుప్పం, ఆగస్టు 31 ప్రభాతవార్త : వైద్య విద్యార్థులు సేవాభావంతో ఉన్నత స్థాయికి ఎదగాలని కుప్పం పిఇఎస్ వైద్యకళాశాల మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్‌కృష్ణమూర్తి సూచించారు. గురువారం పిఇఎస్ వార్షికోత్సవ దినం సందర్భంగా ఉత్సవ్ 23 పేరిట వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవ, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని తద్వారా మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. వైద్య విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా బాగా చదివి రాణించాలని సూచించారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్ఆర్ కృష్ణారావు మాట్లాడుతూ వైద్య కళాశాల వార్షిక నివేదిక, ఏడాది కాలంలో సాధించిన గణాంకాలు వివరించారు. అనంతరం వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో మెడికల్ సూపరింటిండెంట్ డా॥ సుబ్రమణ్య, వైస్ ప్రిన్సిపాల్ డా॥ ర్యాలీ సుబ్బారావు, అధ్యాపకులు, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో...

# ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవ వేడుకలు



ముఖ్య అతిధులను సన్మానిస్తున్న దృశ్యం

తిరుపతి (విద్య), ఆగస్టు 31 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని శ్రీనివాస ఆడిటోరియంలో ప్రపంచ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్టార్టప్, వ్యవస్థాపకత పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి, సృజనాత్మకత, జట్టుకృషి, అవగాహనను పెంపొందించడం జరుగుతుందని, ఎస్వి యూనివర్సిటీలోని ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్ సెంటర్ ద్వారా కార్యక్రమాలు జరుగుతాయని వారు అన్నారు. ఎస్. సుధీర్ కుమార్, డైరెక్టర్, కెపాసిటీ బిల్డింగ్, పబ్లిక్ ఔట్రీచ్, ఇస్రో, బెంగళూరు నుంచి వచ్చి ప్రసంగించారు. ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాల నుండి పూర్వ విద్యార్థులు కెపాసిటీ బిల్డింగ్, స్టార్టప్‌లకు ఇస్రో మద్దతు గురించి స్పిన్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. మిషన్ చంద్రయాన్ 3లో భాగమైన చిన్న స్టార్టప్‌లు చంద్రునిపైకి ఎలా అడుగుపెట్టాయో చెప్పి విద్యార్థులను ప్రేరేపించారు. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌ల ద్వారా ఫ్యాకల్టీల నైపుణ్యాలను పెంపొందించడంలో ఎలక్ట్రానిక్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేసారు. కోఆర్డినేటర్లు ఆచార్య విజభాస్కర్ రావు, ఆచార్య ఓవిఎస్ రెడ్డి ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. రూసా సిఇఓ వంశీ రాయల్ సంధానకర్తగా వ్యవహరించారు. ఎస్వీయూ వివిధ కళాశాలల విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు.

# శరవేగంగా వరదరాజస్వామి నిర్మాణ పనులు

**కుప్పం నుంచి ప్రత్యేకంగా రాయి... కూలీలు**

శ్రీకాళహస్తి,ఆగస్టు 31 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాలను ప్రస్తుత ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారథ్యంలో టెండర్లు పిలిచి పనులకు శ్రీకారం చుట్టారు. మొదట రూ.4కోట్లతో తరువాత రూ.6కోట్లతో పనులు చేపట్టారు. దేవస్థానంకు సంబంధించిన అనుబంధ ఆలయాలకు పూర్వ వైభవం కల్పించుటకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న అభివృద్ధి పనులకు స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధన రెడ్డి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో



శిల్పి పనులను నిర్వహిస్తున్న దృశ్యం

పురాతన కాలం నాటి, రాజుల చే నిర్మించిన ప్రసన్న వరదరాజస్వామి ఆలయం శిథిలావస్తకు చేరుకుంది. ఈ సమస్యను గుర్తించిన చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయ పునర్నిర్మాణానికి నిర్ణయించారు. దేవాదాయశాఖ స్థపతిని సంప్రదించారు. ఆయన ఆలయ పునర్నిర్మాణానికి రూ.6కోట్లతో టెండర్లు పిలి,పనులు ప్రారంభించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఇంటి ముందే ప్రసన్నవరదరాజస్వామి ఆలయం ఉంది. ఇక్కడ జరుగుతున్న పనులను ఆయన ప్రతి రోజూ పరిశీలించి సూచనలిస్తున్నారు.

# బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట

**-భద్రతకు అధునాతన సాంకేతికత -గరుడసేవరోజు ఘాట్‌లో ద్విచక్రవాహనాలు రద్దు**
**-జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో విధులు -టిటిడి ఈఓ ధర్మారెడ్డి**



తిరుమల,ఆగస్టు 31 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వర స్వామికి జరిగే రెండు బ్రహ్మోత్సవాల్లో సామాన్యభక్తుల సౌకర్యాలకు పెద్దపీట వేస్తామని, స్వామి వారి వాహనసేవల వీక్షణంతో బాటు ఆనంద నిలయుడి దర్శనం సంతృప్తికరంగా చేసుకునేలా ఏర్పాట్లు సిద్ధం చేశామని టిటిడి ఈఓఏవి ధర్మారెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు తిరుమలకు అశేషంగా విచ్చేసే భక్తుల భద్రతకు అధునాతన సాంకేతికకత వినియోగిస్తామన్నారు. అదనంగా సిసికెమెరాలు ఏర్పాటు, నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. జిల్లా యంత్రాంగంతో అన్ని విధాలా సమన్వయం చేసుకుని విధులు నిర్వహిస్తూ భక్తులకు మెరుగైన సేవలందిస్తామన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో గరుడసేవరోజు తిరుమల ఘాట్‌లో పూర్తిగా ద్విచక్రవాహనాల రాకపోకలు నిషేధిస్తామని తెలిపారు. కొండపై రెండు వారాల్లో బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నందున భక్తులకు సదుపాయాలు, ఏర్పాట్లపై తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జిల్లా ఎస్పి పి.పరమేశ్వరరెడ్డి, టిటిడి జెఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, తిరుపతి నగరపాలక కమిషనర్ డి.హరిత, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, ఎస్వీబిసి సిఈఓ షణ్ముఖకుమార్‌తో కలసి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఈఓ ధర్మారెడ్డి మాట్లాడుతూ తొమ్మిదిరోజులు విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించ బడవని, ప్రివిలేజ్ దర్శనాలు రద్దుచేశామని అన్నారు. గరుడసేవను రాత్రి 7గంటలకు ప్రారంభించి భక్తులందరికీ దర్శనం కల్పిస్తూ నిదానంతో స్వామివారి వాహనాన్ని ముందుకు తీసుకెళతామన్నారు. భక్తుల కోసం పలు ప్రాంతాల్లో జర్మన్ షెడ్లు ఏర్పాటుచేస్తామన్నారు. తిరుపతి నగరం శివార్లలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తామన్నారు. ఈమీడియా సమావేశంలో టిటిడి సివిఎస్ఓ నరసింహకిశోర్, న్యాయాధికారి జస్టిస్ వీరాజు, తిరుమల అదనపు ఎస్పి మునిరామయ్య, టిటిడి పిఆర్ఓ డాక్టర్ తలారి రవి, డిప్యూటీ ఇఒలు పి.హరీంద్రనాథ్, లోకనాథం, భాస్కర్, రాజేంద్ర, తిరుపతి ఎస్బి డిఎస్పి గిరిధర్, తిరుమల ట్రాఫిక్ డిఎస్పి కొండయ్య, ఆర్టీసి ఇన్‌ఛార్జి ఆర్ఎం జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడిపై దాడి!

**- రోడ్డుపై బైఠాయించిన తెలుగుదేశం నాయకులు - సిఐ క్షమాపణాలు చెప్పాలని డిమాండ్ - 2 గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్**

బంగారుపాళ్యం, ఆగస్టు 31 ప్రభాతవార్త: ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు లేదా! అంటూ తెలుగుదేశం నాయకులు ప్రశ్నించారు. నిరసన తెలుపుతున్న జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడిపై దాడి చేయడం ఎంత వరకు సమంజసమని పోలీసులు నిలదీసిన సంఘటన బుధవారం సాయంత్రం బంగారుపాళ్యంలో చోటు చేసుకొంది. ఈ ఘటనలో సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడుపై దాడి చేయడంతో చికిత్స నిమిత్తం వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించారు. వివరాలిలా వున్నాయి. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి అమరావతమ్మ అధ్యక్షతన సాయంత్రం సర్వ సభ్యసమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశానికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరయ్యారు. సభ ప్రారంభంలో అధికారుల సమీక్ష కొనసాగింది. కొంత సేపటికి 170 గొల్లపల్లి సర్పంచ్ అయిన జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు బిక్షగాడిగా సమావేశంలోకి ప్రవేశించాడు. చిరిగిన బట్టలు, చేతిలో ఓ గిన్నెతో వచ్చిన డబ్బులు అడగడానికి ప్రయత్నించాడు. తాము సర్పంచ్‌లుగా పనులు చేసినా ప్రభుత్వం నుండి నిధులు మంజూరు కాకపోవడంతో మాకు ఈ గతి పట్టిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులు సైతం రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్ళించిందని ఎద్దేవా చేశారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాక అప్పులు పాలై బిక్షగాళ్ళుగా రోడ్డున పడ్డామని నిరసన తెలుపుతూ ప్రకాష్‌నాయుడు నినాదాలు చేశారు. ఆ సమయంలో అక్కడే వున్న బంగారుపాళ్యం ఇన్స్‌పెక్టర్ నాగరాజురావు, ఇతర సిబ్బంది సమావేశం నుండి ప్రకాష్‌నాయుడును బలవంతంగా బయటికి తీసుకెళ్ళారు. ఆ సమయంలో పోలీసులు, ప్రకాష్‌నాయుడు మధ్య వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకొంది. బలత్కారంగా ప్రకాష్‌నాయుడును జీపులో ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌లో స్పృహ తప్పి ప్రకాష్‌నాయుడు పడిపోవడంతో వెంటనే బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరు సిఎంసి ఆసుపత్రికి తీసుకెళ్ళారు. ఈ విషయం తెలిసిన వెంటనే పూతలపట్టు నియోజకవర్గ దేశం ఇన్‌ఛార్జీ డాక్టర్ మురళీమోహన్, పలువురు నాయకులు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొన్నారు. రోడ్డుపై బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య పద్దతితో నిరసన చేస్తున్న వ్యక్తిపై దౌర్జన్యంగా దాడి చేయడం ఎంత వరకు సమంజసమని మురళీమోహన్ నిలదీశారు. నిరసన విరమించాలని పోలీసు



రోడ్డుపై బైఠాయించిన టిడిపి నాయకులు

టిడిపి నాయకులను బ్రతిమాలిన వారు వినలేదు. పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి బంగారుపాళ్యం చేరుకొని టిడిపి నాయకులతో చర్చించి నిరసన విరమించాలని కోరారు. సిఐ నాగరాజరావు బహిరంగంగా క్షమాపణ చెప్పేవరకు నిరసన విరమించేది లేదని భీష్మించుకొన్నారు. సుమారు 2 గంటల పాటు దేశం నాయకులు రోడ్డుపై బైఠాయించడంతో రహదారికి ఇరువైపులా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్గింది. నిరసనను విరమింపజేయడానికి ప్రత్యేక పోలీసులను డిఎస్పీ రప్పించారు. మరోమారు దేశం నాయకులతో డిఎస్పీ చర్చించి హెచ్చరికలు జారీ చేశారు. రెండు రోజుల్లో ఈ విషయంపై పూర్తి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకొంటామని డిఎస్పీ హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు నిరసనను విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, చిత్తూరు పార్లమెంటు టిడిపి కార్యదర్శి కోదండయాదవ్, బంగారుపాళ్యం, యాదమరి, ఐరాల, పూతలపట్టు, తవణంపల్లి మండలాల టిడిపి పార్టీ అధ్యక్షులు జయప్రకాష్, మొరార్జీ, యువరాజులునాయుడు, మధు, గిరిధర్‌నాయుడులు, టిడిపి నాయకులు జనార్ధన్‌గౌడు, కమలనాథరెడ్డి, దేవయాని, రాధాకృష్ణ, అమరనాథనాయుడు, లోకనాథ నాయుడు, శివ, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

తొట్టంబేడు, ఆగస్టు 31 ప్రభాతవార్త :



మండలంలోని పూడి గ్రామ పంచాయతీలో వైఎస్ఆర్‌సిపి కార్యకర్త పల్లం.వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన భౌతిక కాయానికి శాసనసభ్యులు బియ్యపు మధుసూధన్‌రెడ్డి అత్త అనసూయరెడ్డి నివాళులు అర్పించి పూలమాల వేసి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.కార్యక్రమంలో గ్రామ ఇన్‌ఛార్జ్ చెరకు నరసింహనాయుడు, ఎంపిటిసి గురుమూర్తినాయుడు, బాలాజీ, హరి, విజయబాబు, నాగరాజు, డేనియల్‌బాబు, అశోక్, పలువురు వైకాపా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య పాఠశాలలో క్రీడాదినోత్సవ వేడుకలు

తొట్టంబేడు, ఆగస్టు 31 ప్రభాతవార్త :



ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీరాంనగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి అందులో గెలుపొందిన విద్యార్థులకు క్రీడాదినోత్సవ ముగింపు వేడుకల్లో కో ఆర్డినేటర్ బాలాజీ, ప్రిన్సిపల్ రూపాదేవి చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ సుబ్రమణ్యం, ఇన్‌ఛార్జిలు కల్పన, జానకి, పిఇటి మేఘన, ఎట సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## నారాలోకేష్‌కు తెలుగు మహిళల రాఖీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 31 ప్రభాతవార్త :



రాఖీ పౌర్ణమి సందర్భంగా యువగళం నేత తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌కు తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీ కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు జరిగిన సమయంలో ప్రభుత్వం స్పందించే విధంగా తెలుగుమహిళలు పోరాటాలు చేస్తుండడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో 25పార్లమెంటు మహిళా అధ్యక్షురాళ్ళు పాల్గొన్నారు.

## ఏర్పేడు మండలంలో పాదయాత్ర

శ్రీకాళహస్తి రూరల్, ఆగస్టు 31 ప్రభాతవార్త :



ఆంధ్ర ప్రదేశ్‌ను అప్పుల బాధ నుంచి కాపాడి అభివృద్ధిపథంలో నడపాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రావాల్సిందే అని గురువారం ఏర్పేడు క్లస్టర్ ఇన్‌చార్జి రెడ్డి వారి గురువారెడ్డి అన్నారు. యువ నాయకుడు నారాలోకేష్ పాదయాత్ర 200 రోజులు పూర్తి అయిన సందర్భంగా గురువారం దుర్గిపేరి నుంచి ఏర్పేడు వరకు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు భారీ ఎత్తున పాదయాత్ర జరిపారు. ఈ పాదయాత్రలో మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు, పేరం ధనంజయులు నాయుడు,శివశంకర్‌రెడ్డి, కామేష్‌యాదవ్, సుబ్రమణ్యం రెడ్డి, మల్లికార్జున్ నాయుడు, రవి నాయుడు, నాగేశ్వరరావు, షాకిర్‌అలి, పేరం నాగరాజునాయుడు, తాటపర్తి రవీంద్రరెడ్డి, కాసరం రమేష్, ఉమేష్‌రావు, కృష్ణవేణి సూరి నాయుడు, వెంకటాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కోలాటాల్లో బొల్లినేని

ఏర్పేడు (శ్రీకాళహస్తి రూరల్),ఆగస్టు 31 ప్రభాతవార్త :



మండలంలోని మాధవ మాలలో కోలాటాల భజన బృందాలు సాధన చేస్తున్నారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో విశేషంగా కోలాటాలు,భజన బృందాలు ఉంటున్నాయి. గురువారం మండలంలోని మాధవమాలలో ఓ బృందం గజ్జె కార్యక్రమాలకు రాచగున్నేరి మాజీ సర్పంచ్,ప్రముఖ పారిశ్రామిక వేత్త బొల్లినేని జగన్నాధం నాయుడును ఆహ్వానించారు. ఆయన కళాకారులతో కలసి ఆడిపాడారు. బృందాలకు కావాల్సిన సహాయాన్ని అందిస్తామని వివరించారు.

## సెప్టెంబర్ 9న లోక్ అధాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి క్రైం, ఆగస్టు 31 ప్రభాతవార్త :



సెప్టెంబర్ 9వ తేదిన జరిగే జాతీయ లోక్ అధాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సీనియర్ జడ్జి డాక్టర్ కరుణకుమార్ పిలుపునిచ్చారు. గురువారం తిరుపతి పోలీస్ గెస్ట్ హౌస్‌లో జిల్లా సీనియర్ జడ్జి డాక్టర్ కరుణకుమార్, ఏఎస్పీ వెంకట్రావు ఆధ్వర్యంలో జిల్లాలోని డిఎస్పిలు, సీఐలతో జాతీయ లోక్ అధాలత్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అధాలత్ అనగా ప్రజా న్యాయ పీఠం ఇక్కడ ఫిర్యాదుదారులు కోరుకున్న విధంగా కేసు పరిష్కరించడం జరుగుతుంది. లోక్ అధాలత్‌కు ఫిర్యాదు దారుడు ప్రత్యక్షంగా హాజరు కావాలని ప్రత్యక్షంగా హాజరు కాలేనటువంటి సాక్షులు, ముద్దాయిలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైనా కూడా ఇరుపక్షాలను రాజీ చేస్తామన్నారు. తిరుపతి జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు సమిష్టిగా కృషి చేసి, ఈ జాతీయ లోక్ అధాలత్ నందు ఎక్కువ కేసులను రాజీ చేయుటకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా అదనపు ఎస్పి పరిపాలన వెంకట్రావు, జిల్లాలోని డిఎస్పిలు, సిఐలు, ఎస్ఐలు, కోర్టు లైసెన్ ఆఫీసర్లు, ఉమ్మడి చిత్తూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంకు ఆర్థిక విజయాలకు...మహిళా ఖాతాదారులే ముఖ్యం

తిరుపతి,ఆగస్టు 31ప్రభాతవార్త:

బ్యాంకు ఆర్థికవిజయం సాధించడంలో ఖాతాదారులలో మహిళా ఖాతాదారుల పాత్ర ప్రధానమని సప్తగిరిగ్రామీణ బ్యాంకు ఛైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. తమ బ్యాంకు ఖాతాదారుల్లో సగానికి పైగా మహిళలు ఖాతాదారులుగా ఉన్నారన్నారు. స్వయంసహాయక సంఘాలకు రుణవితరణ కార్యక్రమంలో భాగంగా ఎస్‌హెచ్‌జి రుణమేళా విజయవంతమైందన్నారు. తమ బ్యాంకు ఆర్థికవిజయాలకు మహిళా ఖాతాదారులే ముఖ్యమన్నారు. వీరికి ప్రత్యేకంగా సేవలందించేందుకు కొన్ని బ్యాంకు శాఖలు నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో తిరుపతి రీజనల్ మేనేజర్ జి.జయకుమార్, బ్రాంచి మేనేజర్ వెంకటేశన్ ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గంగమ్మతల్లి చల్లనిదీవెనలు ప్రజలకు కలగాలి : టిటిడి ఛైర్మన్

తిరుపతి,ఆగస్టు 31ప్రభాతవార్త:



తిరుపతినగర గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మతల్లి చల్లనిదీవెనలు ప్రజలందరిపై కలగాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. గురువారంఉదయం శ్రావణపౌర్ణమి సందర్భంగా గంగమ్మ ఆలయంలో మహాచండీహోమం నిర్వహించారు. ఈ హోమంలో పాల్గొనేందుకు వచ్చిన ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డికి ఆలయ ఛైర్మన్ గోపీయాదవ్, ఇలయ ఈఓ మునికృష్ణ,అర్చకులు స్వాగతం పలికారు.ఆలయంలో హోమంలో పాల్గొన్న అనంతరం అమ్మవారి దర్శనం చేసుకున్నారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ 4.85లక్షల పంపిణీ

నారాయణవనం, ఆగస్టు 31 ప్రభాతవార్త :



మండలంలోని కొండలచెరువు గ్రామానికి చెందిన కె కృష్ణారెడ్డి కుమార్తె కె ఆశకు తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద మంజూరైన 4.85లక్షల రూపాయాల చెక్కును సత్యవేడు ఎమె ్మల్యే కోనేటి ఆదిమూలం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సిఎం జగనన్నకు, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపిపి పి దివాకర్‌రెడ్డిలకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

## జడ్పీ సిఇఓకి ఘన స్వాగతం

నారాయణవనం, ఆగస్టు 31 ప్రభాతవార్త :



ఉమ్మడి చిత్తూరు జిల్లాల జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డికి గురువారం నారాయణవనంలో ఘన స్వాగతం లభిం చింది. సత్యవేడు నియోజకవర్గంలోని కెవిబిపురం మండలంలో గురువారం జరగనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి వెలుతున్న జడ్పీ సిఇఓకి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, వైకాపా దుశ్శాలువతో ఘన సత్కారం చేశారు. నారాయణవనం మండలంలో సైతం పలు అభివృద్ధి పనులకు సంబందించి బిల్లులు పెండింగ్, కొత్త పనులకు నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు.

## ఈనెల 3తో వ్యవసాయ పాలిటెక్నిక్ అడ్మిషన్లకు ఆఖరు

నారాయణవనం, ఆగస్టు 31 ప్రభాతవార్త :

ఆచార్య ఎస్‌జి ర ంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా వున్న నారాయణవనంలోని ఎస్‌విఎస్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలాంటి ప్రవేశ పరీక్షలు లేకుండా ఈనెల 3వతేది లోపు అడ్మిషన్లు పొందవచ్చని కళాశాల కరస్పాండెంట్ తెలిపారు. 2023-24 సంవత్సరం ప్రేశం కొరకు వ్యవసాయ డిప్లమాలో చేరుటకు 10 పాసైనా విద్యార్థులు, ఇంటర పెయిల్ అయిన విద్యార్థులు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 6300272844 నంబరును సంప్రదించాలన్నారు.

## నారాయణవనంలో యువగళం పాదయాత్ర విజయవంతం

నారాయణవనంవ, ఆగస్టు 31 ప్రభాతవార్త :



మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారాచంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర భవిష్యత్తు వుందని సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హెచ్ హేమలత పేర్కొన్నారు. చంద్రబాబు తనయుడు యువగళం పాదయాత్ర చేపట్టి గురువారంతో 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నారాయణవనంలో మద్దతుగా సత్యవేడు నియోజకవర్గ ఇంచార్జి హెచ్ హెలెన్ హేమతల ఆధ్వర్యంలో పాదయాత్ర గురువారం సాయంత్రం 4గంటలకు జరిగింది. ముందుగా దూండి వినాయకుని ఆలయం లో పూజలు చేసిన తర్వాత పాదయాత్ర ప్రారంభమైనది. మేళతాళాలు, డప్పు, వాయిద్యాలు, భాణసంచా వేడుకల నడుమ పాదయాత్ర సాగింది. అనంతరం కీళగరం వరకు ఈ పాదయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పి గిరిబాబు, ఎన్ భాస్కరన్, టి షణ్ముగం, కెఎస్ రవి, రమేష్, పొన్నుస్వామి, కె వాసుదేవన్, కిలారి విజయకుమార్, కందస్వామినాయుడు, సి బాబు, సుబ్రమణ్యం, ఎస్ఎన్ కందస్వామిమొదలి, ప్రేమ్‌కుమార్, దానవేలు, గుర్రప్ప, కుమార్, దొరవేలురెడ్డి, నరేష్, బిట్ర బాలసుబ్రమణ్యం,పురుషోత్తం,నియోజకవర్గ స్థాయి నాయకులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## నేషనల్ ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్‌కు ఎంపికైన ఆంగ్రూ అగ్రి

తిరుపతిరూరల్, ఆగస్టు31 ప్రభాతవార్త:



నేషనల్ ఇంక్యుబేటర్ కెపాసిటీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌కు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్శిటీ అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ఎంపిక కావడం అభినందనీయమని వ్యవసాయ పరిశోధనా స్థాన సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ సి.రమణ తెలిపారు. స్టార్టప్ ఇండియా ప్లాట్‌ఫాం ద్వారా గత నెల దేశంలోని అన్ని రంగాల ఇంక్యుబేటర్‌ల ధరఖాస్తులను ఆహ్వానించినట్లు తెలిపారు. 83ధరఖాస్తులు రాగా అందులో 25 ఇంక్యుబేటర్‌లను నేషనల్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 12వ తేదీ నుండి ప్రారంభమయ్యే 12 వారాల పాటు శిక్షణా కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

## శ్రీవకుళమాత ఆలయంలో శ్రీలక్ష్మీనారాయణ యజ్ఞం

తిరుపతిరూరల్, ఆగస్టు30 ప్రభాతవార్త:

లోక సంక్షేమం కోసం పేరూరు బండపై వెలసిన శ్రీవకుళమాత ఆలయంలో చేపట్టిన శ్రీలక్ష్మీనారాయణ యజ్ఞం అట్టహసంగా జరుగుతుంది. గురువారం ఉదయం సరస్వతి నవగ్రహ- సుదర్శన హోమాలు, సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. సెప్టెంబర్ 1న లక్ష్మీపూజ, కుంకుమార్చన, మహాపూర్ణాహుతి జరగనున్నాయి. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, ప్రత్యేకశ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ ఎస్‌డిఎస్ మూర్తికి ఫెలో ఆఫ్ ఐఎస్ఏబి అవార్డు

తిరుపతి (క్రీడ), ఆగస్టు 31 ప్రభాతవార్త :



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ బయో కెమిస్ట్రీ విభాగపు సీనియర్ ఆచార్యులు డా.ఎస్‌డిఎస్ మూర్తికి ఇండియన్ సొసైటీ ఆఫ్‌అగ్రికల్చర్ బయో కెమిస్ట్రీ వారిచే ఫెలో అవార్డుకు ఎంపిక కావడం జరిగింది. ఈ అవార్డును నవంబర్ 23 నుంచి 25 వరకు జరిగే అంతర్జాతీయ సదస్సులో ఆచార్య మూర్తి అందుకోనున్నారు. ఇప్పటికే పలుజాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన మూర్తిని విభాగపు సీనియర్ ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు అభినందించారు.

## ముగిసిన మహాభారత ఉత్సవాలు

చంద్రగిరి, ఆగస్టు 31 ప్రభాతవార్త:



చంద్రగిరి ధర్మరాజుల వారి ఆలయంలో మహాభారత ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. స్థానిక ధర్మరాజుల వారి ఆలయంలో గురువారం శ్రీద్రౌపధీ ధర్మరాజుల స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. పినపెద్ద విరూపాక్షి శంకర్ రెడ్డి మహాభారత ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరిపించారు. బ్యాండు బాజాలు బాణాసంఛా పేళుళ్ళ నడుమ శ్రీ భీమార్జున సమేత ద్రౌపధీ అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది.మహిళలు మంగళ హారతులిచ్చి, నారికేళ కర్పూర నీరాజనాలర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి,ఆగస్టు 31 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తీశ్వరాలయంలో 11 మంది సిబ్బందిని అంతర్గత బదిలీలు చేసారు. ఈ సమాచారం గురువారం తెలిసింది. పరిపాలనా సౌలభ్యం కోసం పలు మార్పులు,చేర్పులు చేపట్టారు. ఆలయంలో శానిటరీ ఇన్సెపెక్టర్ రఘునాథ్‌రెడ్డి ఆకస్మిక మరణంతో ఖాళీ ఏర్పడింది. కాబట్టి మార్పులు,చేర్పులు అనివార్యమయ్యాయి.ఈ నేపథ్యంలో శానిటరీఇన్సెపెక్టర్ ఇన్‌చార్జిగా వెంకటస్వామికి బాధ్యతలు అప్పగించారు.జూనియర్ అసిస్టెంట్ ఏ. వెంకటముని అమ్మవారి ఆలయ ఇన్‌చార్జితో పాటు అదనంగా సిఆర్ఓ కార్యాలయ బాధ్యతలు జూనియర్ అసిస్టెంట్ ఎస్.కిషోర్ కుమార్‌రెడ్డికి పిఆర్ఓ,రాహుకేతుదోష నివారణ పూజ ప్యాకింగ్,రూ.500 ఆర్‌కె పూజ టిక్కెట్లు కౌంటర్,కె.మునిరాజలకు ఎంపి ఫారాలు మరియ శానిటరీ,ప్రసాదం కౌంటర్లు,ఎం వెంకయ్యకు మింట్ బాధ్యతలను అప్పగించారు.టి.ఓం ప్రకాష్‌కు అమ్మవారి ఆలయం బాధ్యతలను అప్పగించారు.డి.శ్రీనివాసులును పబ్లికేషన్ స్టాల్,ఎం.రవి చంద్రకు జ్ఞాన ప్రసూనాంబ అతిధి గృహం,పి.కామేశ్వరరావుకు గంగా సదన్,ఎ అనిల్‌బాబును కళ్యాణకట్టకు,వి.రజనికాంత్‌ను ట్రస్టుబోర్డు చైర్మెన్ అటెండర్‌గా నియమించారు.

## పురాతన ఆలయంలో సిమెంటు రాళ్ళతో కట్టడమా?

శ్రీకాళహస్తి,ఆగస్టు 31 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయం ఇంజనీరింగ్ శాఖ పనితీరు రోజుకొక అపచారాలకు నిలయంగా మా ర్చుతున్నారనే విమర్శలు చోటు చేసుకున్నాయి. పురాతన ఆలయంలో ఏదైనా నిర్మాణాలు చేపట్టా లంటే ఆలయ అర్చకుల అభిప్రాయాలు తీసుకో వాలి.స్థానిక సంప్రదాయాలు ఆచార వ్యవహారాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.ఆధునీకరణ పేరుతో సిమెంటు రాళ్ళతో నిర్మాణం చేస్తున్నారు. బూడిదతో తయారు చేసిన సిమెంటు రాళ్ళతో వాడటం ఏ శిల్ప సంప్రదాయానికి సంబంధించినదో ఇంజనీరింగ్ అధికారులకే ఎరుక.

# తిరుపతి డివిజన్

## మానవ హక్కుల పరిరక్షణకు కంకణబద్ధులవుదాం

-ఎన్‌హెచ్‌ఆర్ఎస్‌జెసి రాష్ట్ర చైర్మన్ గౌడపేర చిట్టిబాబు పిలుపు

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 31 ప్రభాతవార్త :

రాష్ట్రంలో మావన హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కంకణ బద్దులు కావాలని, ఆ దిశగా సమున్నత ఆశయంతో ముందుకు సాగాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గౌడపేరు చిట్టిబాబు పిలుపునిచ్చారు. ఆయన ఆదేశాల మేరకు ఎన్‌హెచ్‌ఆర్ఎస్‌జెసి తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా బి. బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా దేవరపల్లి వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శిగా ఏ. మునికృష్ణ, కె. దేవరాజులు, ఏ. మోహనరూప, అలాగే మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా డిఎం చంద్రకళలను నియమిస్తూ ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మోహతాబ్ రాయ్ ఉత్తర్వులు జారీ చేశారు.నూతన బాధ్యతలు చేపట్టిన వారిని ఎన్‌హెచ్‌ఆర్ఎస్‌జెసి ఆంధ్రప్రదేశ్ ఇంచార్జి బి. సర్వేంధర్ అభినందించారు.

## ఫ్యాన్సీ మొబైల్ నెంబర్ అంటూ...

ప్రజలను మోసం చేస్తున్న ఘరానా మోసగాడు

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 31 ప్రభాతవార్త :

గ్రూపులో ఫ్యాన్సీ మొబైల్ నెంబర్ మెసేజ్‌లు చేస్తూ ఒక్కొక్క నెంబర్ 15000, 10000 అంటూ ఫ్యాన్సీ నెంబర్ 9999999998, 9999999997, 9999999996 ఈ నెంబర్స్‌ని చూపిస్తూ ఒక సంవత్సరం దాకా ఇన్‌కమ్మింగ్, అవుట్‌గోయింగ్ చెప్పి రోజు వారి డేటా 2.5 జిబి వస్తుందని చెప్పి వాళ్ళ దగ్గర నుండి అకౌంట్‌లో డబ్బులు వేయమని చెప్పి తాము ఆఫీసుకు తీసుకుంటామని చెప్పినా మా ఆఫీస్ ఇక్కడ లేదండి హైదరాబాదు, విజయవాడ, గుంటూరు, కావలిలో ఉంటుందని చెబుతారు. మా బ్రాంచ్ ఆఫీసు అని చెప్పి అకౌంట్‌లో డబ్బులు వేసుకుంటున్నాడు మీకు మీ ఆధార్ కార్డు పెట్టండి, మీ సెల్ఫీ ఫోటో పెట్టండి అని చెప్పి మీకు కొరియర్‌లో మీ ఇంటికి అడ్రస్‌కి వస్తుందని చెప్పి అకౌంట్‌లో డబ్బులు వేసుకున్నాక మళ్లీ ఫోన్ లిఫ్ట్ చేయట్లేదు అతను పేరు ఎంవి సుబ్బారెడ్డి అని చెబుతున్నాడు. ఫస్ట్‌లో ఆ అమౌంట్ అకౌంట్‌లో వేయాలి సిమ్ వచ్చిన తరువాత మిగతా అమౌంట్ వేయాలని చెప్తాడు తర్వాత సిమ్‌లు మేము కొరియర్ చేస్తామని అంటాడు. అతను అకౌంట్‌లో డబ్బులు పూర్తిగా వేసేదాకా ఫోన్లు కంటిన్యూగా మనకు చేస్తుంటాడు. డబ్బులు అకౌంట్లో పూర్తిగా పడాక మనం చాలా ఫోన్ చేసినా మళ్ళీ ఫోన్ లిఫ్ట్ చేయడు ఇలా చాలా మంది మోసపోతుంటారని అతని దగ్గర దయచేసి అతన్ని నమ్మొద్దండి అతను కాంటాక్ట్ నెంబర్స్ 9133242807, 8978779407 అని తెలిపారు.

## ఘనంగా సంచార జాతుల విముక్తి దినోత్సవం

తిరుపతి (క్రీడా), ఆగస్టు 31 ప్రభాతవార్త :



అఖిల భారత 71వ సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యూత్ హాస్టల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా కుటుంబ సభ్యులతో సహా ఆ సంచార సంఘం నాయకులు పాల్గొన్నారు. అన్నారెడ్డి వెంకట్, తిరుపతి జిల్లా నాయకులు పగడాల ప్రసాద్, గంగాధరం, కృష్ణ, పవన్‌లతో సహా జాతీయ నాయకులు పాల్గొన్నారు.

## గుమ్మడి సోదరులకు ఘన సన్మానం

రేణిగుంట, ఆగస్టు 31 ప్రభాతవార్త:



దివంగత గుమ్మడి వెంకటేశ్వరులు కుమారులు జయంతకుమార్, రవికుమార్‌లను రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. రైల్వే విశ్రాంత ఉద్యోగి గుమ్మడి జయంతి సీసీఎస్ డీఎస్పీ గుమ్మడి రవికుమార్ జాతీయ పోలీసు మెడల్ అందుకున్నందుకు గాను పెన్షనర్స్ అసోసియేషన్ అడ్వైజర్ సంజీవరాయప్ప సమక్షంలో సన్మానం జరిగింది.కార్యక్రమంలో ఆసన్, వైస్ ఎంపీపీ సుజాత, త్రిపుర సుందరం, రంగయ్య, జ్ఞానశేఖర్, రామూర్తి, అన్బు, రాజేంద్రన్, అప్పారెడ్డి, రవీంద్రబాబు, ఆషా జూలియన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## భానుప్రకాష్‌కు రాఖీ కట్టిన తెలుగు మహిళలు

నగరి, ఆగస్టు 31 ప్రభాతవార్త:



రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని గురు వారం నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు పలువురు తెలుగు మహిళలు రాఖీ కట్టి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రజలంతా ఘనంగా జరుపుకునే రక్షాబంధన్ పండుగ సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో నీటి సమస్య ఉండదు: సర్పంచ్

రేణిగుంట, ఆగస్టు 31 ప్రభాతవార్త:



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి పవిత్రరెడ్డి చొరవతో రేణిగుంట పంచాయతీలో నీటి సమస్య రాకుండా కట్టుదిట్టమైన చర్యలుచేపడుతున్నామని కొంత మంది ప్రచారం కోసం బురద చల్లుతున్నారని సర్పంచ్ నాగేషం అన్నారు. పంచాయతీలోని చెడిపోయిన బోర్లను మరమ్మతులు, కాలిపోయిన మోటార్లను రివైండింగ్ చేయిస్తామన్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు పాలక మండలి సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నీటి ఎద్దడిని ఉంటే నివారించడానికి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామన్నారు. పంచాయతీ నీటి సరఫరా కార్మికులు ప్రజలకు సహకరించకపోతే చర్యలు కఠినంగా తీసుకుంటామన్నారు. కొంత మంది తమకు కావలసిన వాళ్ళకు నీటిని ఇచ్చి పంచాయతీపై బురద చల్లడాన్ని తీవ్రంగా ఖండించారు.

## ఔషధాల తయారీలో ఫార్మా విద్యార్థులదే కీలక పాత్ర

రామచంద్రాపురం, ఆగస్టు 31 ప్రభాతవార్త:



ఔషధాల తయారీలో ఫార్మా విద్యార్థులదే కీలక పాత్ర అని ఏపి ఐటి అధ్యక్షుడు డాక్టర్ వెంకటరమణ అన్నారు. గురువారం వెంకటరామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాలలో గ్లోబల్ ఫర్‌ఫెక్ట్ ఇన్ క్లినికల్ ఫార్మాలజీ, థీరియాటిక్ డ్రగ్ మానిటరింగ్‌పై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా కళాశాల విద్యార్థులకు ఔషధాల తయారీపై విద్యార్థి దశ నుండే అవగాహన పెంపొందించాలన్నారు. వ్యాధుల నివారణకు వినియోగించే ఔషధాల నియంత్రణపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫార్మా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ వుంటుదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి ఐటి ఈసి డాక్టర్ జ్యోతి, సెవెన్ హిల్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్‌బాబు, డాక్టర్ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి చిరునామా చంద్రబాబు

-టిడిపి నియోజకవర్గ ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని

రామచంద్రాపురం, ఆగస్టు 31 ప్రభాతవార్త:

రాష్ట్ర అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిరునామా అని టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. యువగళం పాద యాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు సంఘీబావం తెలియజేశారు. ఇందులో భాగంగా రాయలచెరువు కట్ట వద్ద వెలసియున్న శ్రీయోగ ఆంజనేయస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించి, ఆలయం నుండి రామచంద్రాపురం కూడలి వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు జనార్ధన్ చౌదరి, చినబాబు, ఉమాపతి నాయుడు, నరశింహారెడ్డి, మహేష్ నాయుడు, ప్రభాకర్ రాయల్, కోటీశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మల్లెపూల సాగును లాభ సాటిగా మార్చుకోండి

నారాయణవనం, ఆగస్టు 31 ప్రభాతవార్త :



మల్లెపూల సాగును అవగాహనతో లాభ సాటి పంటగా మార్చుకోవాలని స్పీక్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ మార్కెటింగ్ అభివృద్ధి ఆఫీసర్ తిరుమలరావు తెలిపారు. మండలంలోని కొండల చెరువు గ్రామంలో గ్రీన్ స్టార్ ఫెర్టిలైజర్స్ కంపెనీ వారి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ముబారక్, సాయికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

